క్లుప్తంగా

విగ్రహాల పునరుద్ధరణకు నేతల వినతి



బాపట్ల: మహనీయుల విగ్రహాలను పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్, కోకి రాఘవరెడ్డి కోరారు. మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌కు శుక్రవారం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. బాపట్ల పట్టణంలోని జీబీసీ రోడ్డు విస్తరణలో భాగంగా వివిధ సెంటర్లలో ఉన్న మహనీయుల విగ్రహాలను తొలగింపునకు అఖిలపక్షం సమావేశం నిర్వహించి, నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. రోడ్డు పనులు పూర్తయినందున తొలగించిన విగ్రహాలను పునరుద్ధరించాలని కోరారు. బాపట్ల పట్టణ అధ్యక్షుడు జోగి రాజా, బీసీ సెల్ నాయకుడు సాయిల మురళి, సీనియర్ నాయకులు కటికల యోహోషువా, గుని వినిమణిరెడ్డి పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



బాపట్ల: కిశోర బాలికల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టరు జనార్దనం పేర్కొన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల, వెదుళ్లపల్లి ప్రాథమిక వైద్యశాలను ఆయన ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. బాలికలకు రక్తహీనత లేకుండా చూసుకోవాలని చెప్పారు. మందులు స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పని సరిగా ఐరన్ టాబ్లెట్స్ ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టరు కిరణ్, జేడీఏతో పాటు ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధార్థ డాక్టరు మానసా ప్రియదర్శి, డాక్టరు వైష్ణవికృష్ణ ఉన్నారు.

మంచినీటి సరఫరాలో లోపాలు రానివ్వకండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో రక్షిత మంచినీటి పథకం కింద అందిస్తున్న నీటి సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 17వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటి శాంపిల్స్‌ను సేకరించాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అభ్యుదయ రైతు సుదర్శన బాబుకు ఘననివాళి

తెనాలి: పట్టణానికి చెందిన అభ్యుదయ రైతు, వ్యాసరచయిత, పుస్తక ప్రచురణకర్త కొడాలి సుదర్శనబాబు (68)కు శుక్రవారం వివిధ రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. అనారోగ్యంతో గురువారం హైదరాబాద్‌లో మృతిచెందిన సుదర్శనబాబు భౌతికకాయాన్ని అదేరోజు రాత్రి తెనాలికి తరలించారు. స్థానిక సుల్తానాబాద్ అలపాటి నగర్‌లోని నివాసంలో ఉంచిన సుదర్శనబాబు భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం వివిధ రంగాల ప్రముఖులు, సన్నిహితులు సందర్శించారు. పుష్పాంజలి ఘటించారు. 10.30 గంటల ప్రాంతంలో అంతిమయాత్ర నిర్వహించి, పాండురంగపేటలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. నివాళులు అర్పించినవారిలో జనసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, ప్రముఖ రచయిత/పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాద్, డాక్టర్ కొమ్మినేని రమేష్‌బాబు, డాక్టర్ జగదీశ్వరి, యడ్లపాటి రఘురాం, శాఖమూరి తిమ్మనాయుడు, చిట్టినేని సాంబశివరావు, అలపాటి వెంకట్రామయ్య, డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు, మొవ్వా చలపతిరావు, తుమ్మల బాపయ్యచౌదరి, నన్నపనేని చిట్టిబాబు, కాట్రగడ్డ హేమచంద్ర ప్రసాద్, జెట్టి నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: ఎయిడ్స్ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎయిడ్స్ కంట్రోలు సొసైటీ ఆదేశాల మేరకు సిరి మహిళా సాధికారిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. సిరి మహిళా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎ.రాజు పాల్గొన్నారు.

రాత్రిళ్లు రక్షణ కల్పించాలి



ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులకు తెగబడడం అమానుషం. అలాంటి వారికి కఠిన శిక్షలు అమలు చేయాలి. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలకు పాల్పడకుండా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి వైద్యశాలలో దాడులకు పాల్పడితే విధించే శిక్షలను బోర్డుల రూపంలో ప్రదర్శించాలి. ప్రతి పీహెచ్‌సీలో రాత్రిళ్లు రక్షణ ఏర్పాట్లు చేయాలి.

– కె.భావన, వైద్యాధికారి, కనగాల పీహెచ్‌సీ, చెరుకుపల్లి



సామాజిక అవగాహన కల్పించాలి



యువతలో సామాజిక అవగాహన పెంచాలి. వైద్య సేవలు అందించే చోట రక్షణ పెంచాలి. యువత చెడు మార్గాల్లో పయనించకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థినులకు రక్షణ పరమైన విషయాలపై తరుచుగా తల్లిదండ్రులు సూచనలివ్వాలి. దాడులను అరికట్టేందుకు హెల్ప్ లైన్ నంబర్లను బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి.

– ఎస్.జాలమ్మ, ఏఎన్ఎం, బాపట్ల

గ్రామ స్వరాజ్యం..టీడీపీ నేతల ఇష్టారాజ్యం

- గ్రామ సభల వేదికల్లో పచ్చ నాయకులకే పట్టం
- ప్రత్యేకాధికారుల గైర్హాజరుతో మొక్కుబడిగా ముందుకు
- ప్రజా స్పందన కరువు.. కుర్చీల్లో ప్రభుత్వ సిబ్బందే ప్రజలు



కొల్లూరు: ఆవులవారిపాలెం గ్రామ సభలో మొక్కుబడిగా గ్రామ సభ

కొల్లూరు : ఉపాధి హామీ పథకం పనులు గుర్తింపు, పంచాయతీల సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సభలు తెలుగుదేశం పార్టీ వేదికలయ్యాయి. శుక్రవారం మండలంలోని 24 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నేతృత్వంలో గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంది. ప్రత్యేకాధికారుల గైర్హాజరీతో మొక్కుబడిగా సభలను ముగించేశారు. గ్రామ సభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అరకొరగానే ప్రాతినిధ్యం లభించింది. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు సర్పంచ్‌లుగా ఉన్న పంచాయతీల్లో టీడీపీ నాయకులు వేదికలు ఆక్రమించుకున్నారు. జరిగిన గ్రామ సభల్లో కూడా ఉపాధి హామీ పనుల గుర్తింపు, స్థానిక సమస్యలపై దృష్టి సారించకుండా టీడీపీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలతో హోరెత్తించారు. జువ్వలపాలెం పంచాయతీలో గ్రామ సభలో ప్రత్యేకాధికారి గైర్హాజరీతో టీడీపీ, సీపీఎం నాయకులు వేదికపై పెత్తనం చేశారు. జువ్వలపాలెంలో టీడీపీ మద్దతుతో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిన వ్యక్తికి వేదికపై అధిక ప్రాధాన్యమిస్తూ, వైస్ సర్పంచి బి. సాంబశివరావును అడ్డుపెట్టుకొని సర్పంచి భూపతి కిశోర్ వచ్చే సమయానికి నామ మాత్రంగా సభను ముగించేశారు. కొల్లూరులో గ్రామ సభకు ప్రజల నుంచి స్పందన కరువై కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో సచివాలయ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలను కూర్చోపెట్టి సభ అట్టహాసంగా జరిగినట్లు చెప్పే ప్రయత్నం చేశారు.

- **కొల్లూరు** : ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిలో ముందంజలో ఉండవచ్చునని ఏపీఓ జె.లక్ష్మి అన్నారు. శుక్రవారం కొల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఆమె ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల గురించి వివరించారు. మండలం జిల్లాలో 3వ స్థానంలో ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ రూ.4 కోట్లు ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించడం జరిగిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు రూ.2.50 కోట్లు నిధులు మండలానికి అందాయని చెప్పారు. సర్పంచి ఆర్. విజయ, వైస్ సర్పంచి కృష్ణ, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, వైద్యాధికారిణి వి.కావ్యతేజ, మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

- **కర్లపాలెం:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డులున్న కుటుంబాలకు పనులు కల్పిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు చెప్పారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. కర్లపాలెం గ్రామసభలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పాల్గొన్నారు. ఏపీవో మహేష్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా 104 పనులు గుర్తించామని చెప్పారు. కూలీలతో చేయించగలిగిన పనులు మాత్రమే గుర్తించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జల్ది భాగ్యశ్రీధర్ ఎంపీడీవో ఎలీషాబాబును కోరారు. ఈ మేరకు కార్మిక సంఘం నాయకులతో కలసి వినతిపత్రం అందజేశారు.
- **భట్టిప్రోలు:** గ్రామాలను స్వయం శక్తి కేంద్రాలుగా మార్చుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఐలవరం సచివాలయం ఆవరణలో గ్రామ సభ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో జి. చంద్రశేఖరరావు, పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- **చెరుకుపల్లి:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దారు సీహెచ్ పద్మావతి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఉద్యాన సాగు నూరు శాతం రాయితీపై మొక్కలు ఇచ్చి, సంరక్షణకు నిధులు కూడా మంజూరు చేస్తారన్నారు.
- **రేపల్లెరూరల్:** పేటేరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం, డొంక రోడ్ల అభివృద్ధి, కాల్వల పూడిక తీత పనులు చేసుకోవచ్చన్నారు. అరవపల్లి, బేతపూడి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఎంపీడీవో శివపార్వతి, మోర్లవారిపాలెం, కారుమూరు పంచాయతీలలో జరిగిన గ్రామసభల్లో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుబ్బారావు పాల్గొన్నారు.
- **పిట్టలవానిపాలెం:** ఖాజీపాలెం గ్రామ సచివాలయం జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు సమస్యలను లేవనెత్తారు. ప్రధానంగా గ్రామంలో పారిశుద్ధ్యంపై గ్రామ కార్యదర్శి పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారులు ఎవరో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తహసీల్దారు మెహర్ కుమార్ మాట్లాడుతూ రోజుకు రెండు వార్డుల చొప్పున పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

వేమూరు (కొల్లూరు) : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. శుక్రవారం వేమూరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. పల్లెటూర్ల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమన్న సంకల్పంతో సీఎం, డిప్యూటీ సీఎం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. సమావేశంలో పలువురు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

జనం ఏరీ..?

పిట్టలవానిపాలెం: పిట్టువారిపాలెం గ్రామ సచివాలయం వద్ద 11.20 నిమిషాలైన అధికారులు, గ్రామస్తులలో ఒకరు మినహా ఎవరూ గ్రామ సభలకు హాజరు కాలేదు. మండలంలోని అధికారులు గ్రామ సభలపై గ్రామస్తులకు తెలియకుండా గోప్యంగా ఉంచారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చాలా చోట్ల సభలకు జనం హాజరు కాలేదు.



పిట్టువారిపాలెంలో ఉదయం 11.20 గంటలకు ఇలా..

గ్రామ సర్పంచ్ లేకుండానే..



నగరం: పూడివాడ గ్రామసభలో వేదికపై టీడీపీ నాయకులు

నగరం: మండలంలోని పూడివాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామ సర్పంచ్ పాగోలు సుజాత, ఉప సర్పంచ్ జాలాది సునీల్, వార్డు మెంబర్లు లేకుండానే గ్రామ సభ నిర్వహించారు. టీడీపీ నాయకులతోనే పంచాయతీ అధికారులు సభను నిర్వహించడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి నిబంధనలకు విరుద్ధంగా గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి షేక్ కరిముల్లా, కార్యదర్శి కె.కల్యాణి గ్రామ సభ జరపడంపై పలువురు ప్రశ్నించారు. పూడివాడ గ్రామ సభలో తీర్మానాల రిజిస్టర్‌లో ఎటువంటి అంశాలు లేకుండా ఖాళీ పేపర్లపై ప్రజలతో సంతకాలు చేయించారని గ్రామస్తులు తెలిపారు. టీడీపీ నాయకుల జోక్యంతోనే గ్రామ సభలు నిర్వహించారని, గ్రామ సభ గురించి ఎలువంటి సమాచారం ఇవ్వకుండా ప్రోటోకాల్ ఉల్లంఘించి గ్రామ సభలను నిర్వహించడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పూడివాడ గ్రామ ఉప సర్పంచ్ జాలాది సునీల్ తెలిపారు.

మంత్రి అనగానికి స్కీం వర్కర్ల వినతి

రేపల్లె రూరల్: అంగన్‌వాడీ, ఆశ, ఐకేపీ వీవోఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్‌కు రేపల్లె ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను వారికి విన్నవించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, కనీస వేతనం అమలు చేయాలన్నారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి అనగాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



మంత్రికి సమస్యల వినతిపత్రం ఇచ్చిన స్కీం వర్కర్లు

ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సంఘాల నాయకులు కె.ఝాన్సీ, వై.మేరీమణి, సీహెచ్ వీరలక్ష్మి, శేషకుమారి, గ్లోరీ, ఎన్ కృష్ణకుమారి, రత్నకుమారి, అరుణ, బేబీ రాణి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళి

రేపల్లె రూరల్: ఆంధ్ర రాష్ట్ర ముద్దుబిడ్డ టంగుటూరి ప్రకాశం పంతులు యువతకు స్ఫూర్తిప్రదాత అని రెవెన్యూ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జాన్ పీటర్ అన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి ప్రకాశం పంతులు తన వంతు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఓ, సిబ్బంది

నైపుణ్యాభివృద్ధిపై అతిథి ఉపన్యాసం

నగరం: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించే విధంగా బోధన అందింస్తున్నట్లు ఎస్వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధి అవసరమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గెస్ట్ లెక్చర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ సెక్యూరిటీ అంశంపై పీవీఎస్ రాఘవేంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



వరలక్ష్మి వ్రతంలో మహిళలు



ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లు

వెల్లటూరు(భట్టిప్రోలు): మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు శ్రావణ శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు క్రోవి రామకృష్ణ మహిళలతో కుంకుమార్చన, వరలక్ష్మి వ్రతం చేయించారు. రామకృష్ణ మాట్లాడుతూ లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైన శుక్రవారం పూజలు చేస్తే.. సకల శుభాలు కలుగుతాయన్నారు. శ్రీ హరి జన్మ నక్షత్రం శ్రవణం పేరిట వచ్చే శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తే విశేష ఫలితాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలను దేవస్థాన కమిటీ పర్యవేక్షించింది.

నకిలీ జామీను పత్రాలు

కొల్లూరు : కోర్టులనే నకిలీ ధ్రువీకరణ పత్రాలతో తప్పుదారి పట్టించేందుకు కొందరు కేటుగాళ్లు తెగబడుతున్నారు. జామీను పత్రాలు సమర్పించే విషయంలో ఫోర్జరీ సంతకాలు, తప్పుడు ఇంటి డోర్ నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్లతో పాటు, ఒక రోజు ముందు తేదీ వేస్తున్నారు. ఈ నకిలీ వ్యవహారం శుక్రవారం బయటపడినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. తెనాలి 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసు తెనాలిలోని ఓ కోర్టుకు వెళ్లింది. నిందితుడైన వ్యక్తికి జామీన పత్రాలు అవసరం అవడంతో కొల్లూరుకు చెందిన ఇద్దరు మహిళల పేర్లతో జామీను పత్రాలు సిద్ధం చేశారు కేటుగాళ్లు. కోర్టుకు నకిలీ ఇంటి పన్ను పత్రాలను అందజేశారు. జామీను పత్రాల పరిశీలనలో భాగంగా కోర్టు ఉద్యోగికి అనుమానం తలెత్తింది. ఆరా తీసేందుకు కొల్లూరు ఈఓ బి. మల్లికార్జునను ఫోన్‌ల సంప్రదించారు. తాను రెండురోజులుగా ఎటువంటి జామీను పత్రాలు మంజూరు చేయలేదని ఆయన తెలిపారు. తమకు అందిన పత్రాల ఫోటోలను వాట్సాప్ ద్వారా ఈఓకు పంపించారు. పరిశీలించిన ఈఓ అవి తాము మంజూరు చేయలేదని గుర్తించారు. అందులో ఉన్న డోర్, అసెస్మెంట్ నంబర్లు, ఇంటి పన్ను కింద వేసిన నగదు సైతం తప్పుడువని నిర్ధారించుకున్నారు. కోర్టు ఉద్యోగికి సమాచారం ఇచ్చారు. ఈఓ పేరు బి. మల్లిఖార్జున కాగా కోర్టుకు సమర్పించిన పత్రాలలో బి.మల్లిఖార్జునరావు అని సంతకాలు పెట్టడం, ఈఓపీఆర్డీ ఇంటి పేరు సీహెచ్ రవిబాబు అవగా ఓ జామీను పత్రంలో 'సీహెచ్' అని, మరో జామీను పత్రంలో 'కె' అని ఇంటి పేర్లు తప్పుగా ఉండటాన్ని గమనించారు. వీటితోపాటు ఈ నెల శుక్రవారం 23న కోర్టుకు సమర్పించిన జామీను పత్రాలలో ఈ నెల శనివారమైన 24వ తేదీ ఉండటాన్ని గుర్తించి ఫోర్జరీ సంతకాలతో కూడిన పత్రాలుగా నిర్ధారించారు. కంప్యూటర్ ఫార్మెట్‌లో ఉండాల్సిన ఇంటిపన్ను రసీదులు సైతం చేతి రాతతో కూడిన పత్రాలను వినియోగించడంతో పాటు, పంచాయతీ కార్యాలయం పేరుతో ఉండాల్సిన స్టాంప్ స్థానంలో కొల్లూరు గ్రామ సచివాలయం స్టాంప్‌లు వేసి, నకిలీ జామీను పత్రాలు సృష్టించినట్లు స్పష్టమయ్యింది.

వరలక్ష్మిగా బండ్లమ్మ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బండ్లమ్మ దేవాలయంలో శ్రావణ మాసం పురస్కరియుకుని శుక్రవారం అమ్మవారిని వరలక్ష్మిగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలోపాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువులు

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాజర్‌పేటలో శుక్రవారం వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న దోమ పెను ప్రమాదానికి కారణమన్నారు. దోమల వ్యాప్తి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో, పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, జి.రవికుమార్, లక్ష్మి, రషీద్, రత్నాకరరావు పాల్గొన్నారు.

టైరు బండ్లను అడ్డుకున్న అధికారులు

రోడ్డుకు అడ్డంగా బండ్లతో యజమానుల నిరసన

భట్టిప్రోలు: మండలంలోని పెదలంక కాకులడొంక రేవు నుంచి ఇసుక రవాణాకు వెళ్తున్న టైరు బండ్లను రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు అడ్డుకున్నారు. అనుమతులు ఉన్న కొల్లూరు మండలం జువ్వలపాలెం రేవులో నీరు ఉండటంతో టైరు బండ్ల యజమానులు దాదాపు 25 మంది గురువారం రాత్రి కాకులడొంకకు వచ్చారు. వీఆర్వో మంద్రు జక్రయ్య, పోలీసులు వారిని అడ్డుకుని సమాచారాన్ని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు తెలియజేశారు. అర్ధరాత్రి నుంచి వీరిని పెసర్లంక జెడ్పీ హైస్కూల్ వద్ద నియంత్రించారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు రహదారికి అడ్డంగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట బండ్లను అడ్డు పెట్టి, నిరస వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసరావు ఎస్ఐ శివయ్యకు ఫోన్ చేసి ట్రాఫిక్ ఏర్పడకుండా క్లియర్ చేయమని ఆదేశించారు. పోలీసుల రాకతో టైరుబండ్ల యజమానులు తమ నిరసనను విరమించుకున్నారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా రేవులో ఎలాంటి తవ్వకాలు జరిపే అవకాశం లేదని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే అరెస్టు చేసే అవకాశం ఉందని తహసీల్దారు తెలిపారు. టైరు బండ్ల యజమానులు జిల్లా కలెక్టర్ లేదా ఎమ్మెల్యేకు గృహ అవసరాల నిమిత్తం ఇసుకను తీసుకువెళుతున్నట్లు ఒక వినతిపత్రాన్ని అందజేస్తే.. వారి అనుమతుల ప్రకారం వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుకు అడ్డంగా టైరు బండ్లు

క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడికి అభినందన

తెనాలి: ఇండో-నేపాల్ టీ20 క్రికెట్ ఫెడరేషన్ సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన తెనాలి యువకుడు ఎం.చేతన్‌దత్త యాదవ్‌ను శుక్రవారం సాయంత్రం తట్టుకూళ్ల అశోక్ యాదవ్ కార్యాలయంలో యాదవ సంఘీయులు సత్కరించారు. నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. స్వయంకృషితో క్రికెట్ సాధన చేసిన చేతన్‌దత్త యాదవ్, భారత జట్టుకు ఎంపికవటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరింతగా రాణించి, భారత అధికారిక జట్టుకు ఎంపిక కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, దొడ్డక ఆదినారాయణ, గుమ్మడి వెంకటనారాయణ, చెన్నుబోయిన శ్రీనివాసరావు, మునగా నరసింహారావు, పిట్టు వెంకట కోటేశ్వరరావు, ఆరాధ్యుల కన్నా, తాడిబోయిన కృష్ణ, తట్టుకూళ్ల తేజ యాదవ్, మద్దిబోయిన ఫణి, తుల్లిమిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.



చేతన్‌దత్త యాదవ్‌ను సత్కరిస్తున్న సంఘీయులు